



# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కలీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

సోమవారం | 02 నవంబరు, 2026 | పేజీలు : 06


# అక్రమ వెంచర్లకు అడ్డుకట్ట ఏదీ?

### అనుమతులు లేకుండానే లేఅవుట్లు, అధికారుల నిర్లక్ష్యంపై అనుమానాలు





**ప్రజా పక్షం /ఖానాపూర్ :** ఖానాపూర్ మండలంలో అక్రమ రియల్ ఎస్టేట్ వెంచర్లు యథేచ్ఛగా వెలుస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కుతూ వాగులు, వంకలను ,పంట భూములను,ప్రభుత్వ భూములను ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.పట్టణానికి సమీపంలోనే ఉన్న ఒక వాగును పూడ్చి లేఅవుట్‌గా మార్చినట్లు ఆరోపణలు వస్తున్నా సంబంధిత అధికారులు స్పందించక పోవడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

**పంట పొలాలు వాగులను మాయం చేసి.. ప్లాట్లుగా విక్రయం!** సహజంగా వర్షపు నీరు ప్రవహించేందుకు ఆధారమైన వాగును మట్టితో పూడ్చి ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. వాగు ప్రవాహ మార్గాన్ని అడ్డుకోవడం వల్ల భారీ వర్షాలు కురిసినప్పుడు సమీప కాలనీలు నీటమునిగే ప్రమాదం ఉందని, అదే విధంగా పంట పొలాలను ప్లాట్లుగా మారుస్తున్నారని,స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సంబంధిత ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

**అనుమతులు ఉన్నాయా?** లేవా? డీటీసీపీ, మున్సిపల్ అనుమతులు లేకుండానే కొన్ని వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్కు స్థలాలు, సరైన రహదారులు, డ్రైనేజీ సదుపాయాలు లేకుండానే ప్లాట్ల విక్రయాలు సాగుతున్నాయనే విమర్శలున్నాయి. తక్కువ ధరకు ప్లాట్లు వస్తున్నాయనే ఆశతో కొనుగోలు చేసే సామాన్యులు, ఆ భూముల చట్టబద్ధతపై పూర్తి వివరాలు తెలుసుకోకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది. అందువల్ల సంబంధిత అధికారులు అనుమతులు, భూముల స్వరూపం,రిజిస్ట్రేషన్ల వివరాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**అధికారుల మౌనం వెనుక మర్మం ఏమిటి?** వాగులు, ప్రభుత్వ, పంట భూములకు సంబంధించిన ఆరోపణలు వెలుగులోకి వస్తున్నప్పటికీ చర్యలు కనిపించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, రిజిస్ట్రేషన్ శాఖలు సమన్వయంతో విచారణ చేపడితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అభిప్రాయపడుతున్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడంలో జాప్యం ఎందుకు జరుగుతోందనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.అయితే, సంబంధిత అధికారుల వివరణ, భూముల రికార్డులు, లేఅవుట్ అనుమతుల పరిశీలనతో ఆరోపణలను నిర్ధారించాల్సి ఉంది.

**ప్రజల డిమాండ్.. సమగ్ర విచారణ చేపట్టాలి!** జిల్లా కలెక్టర్, సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఆరోపణలు ఎదుర్కొంటున్న వెంచర్లపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. వాగులు, కుంటలు,పంట భూములు,ప్రభుత్వ భూముల ఆక్రమణలపై క్షేత్రస్థాయి సర్వే నిర్వహించాలని,అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా ఉన్న లేఅవుట్లపై తగిన చర్యలు తీసుకుని, ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రజల ప్రయోజనాలను కాపాడాలని కోరుతున్నారు.ఇప్పటికైనా అధికారులు మేల్కొంటారా? భూములు, వాగుల, వంకల పరిరక్షణకు చర్యలు తీసుకుంటారా? లేక అక్రమ వెంచర్ల దందా యథేచ్ఛగా కొనసాగుతుందా? అన్నది వేచి చూడాలి.

# విద్యార్థి ఆత్మహత్య

**ప్రజాపక్షం / గన్నేరువరం :** గన్నేరువరం మండలం పారువెల్ల గ్రామంలో విషాదకర సంఘటన చోటు చేసుకుంది. 6వ తరగతి చదువుతున్న 11 ఏళ్ల బాలుడు జస్వంత్ ఇంట్లో ఉరేసుకొని మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పారువెల్ల గ్రామానికి చెందిన ఎలుక నరసయ్యరజిత దంపతులకు ఇద్దరు కుమారులు. మూడేళ్ల క్రితం నరసయ్య అనారోగ్యంతో మృతి చెందగా రజిత కూలి పనులు చేసుకుంటూ ఇద్దరు కుమారులను పోశిస్తుంది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం రజిత కూలి పనికి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా పెద్ద కుమారుడు జస్వంత్ తల్లిని పనికి వెళ్లవద్దని కోరుతూ వాదించాడు. తల్లి అతడికి నచ్చజెప్పి పనికి వెళ్లింది. పని ముగించుకొని ఇంటికి తిరిగి వచ్చిన రజితకు కుమారుడు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించడంతో తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ ఘటనపై మృతుడి తల్లి ఎలుక రజిత ఇచ్చిన ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేందర్ రెడ్డి తెలిపారు.



# కాలుష్యం కోరల్లో పవిత్ర గోదావరి

### పట్టించుకోని మున్సిపాలిటీ, ప్రజల ఆందోళన

**ప్రజా పక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ పట్టణంలోని పవిత్ర గోదావరి నది ప్రస్తుతం తీవ్ర కాలుష్య కోరల్లో చిక్కుకుంది. దుర్గాదేవి, గణపతి విగ్రహాల వ్యర్థాలు, కుళ్లిపోయిన పూలమాలలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ అవశేషాలు నదిలోనే పేరుకుపోవడంతో నది తీవ్ర కాలుష్యం బారిన పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**జలచరాలు మృతి – అంటు వ్యాధుల భయం :**విగ్రహాలకు వాడిన రసాయన రంగులు నీటిలో కలవడం వల్ల జలచరాలు చనిపోతున్నాయని, నీరు ఎందుకు పనికిరాకుండా పోయిందని అంటున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే నదిలో స్నానం చేసే వారు అంటు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

**నెల రోజులు దాటినా తొలగించని అవశేషాలు :** గణపతి నిమజ్జనం జరిగి నెల రోజులు దాటినా ఇప్పటికీ విగ్రహాల అవశేషాలు నది నీటిలోనే ఉండిపోయాయని ప్రజలు విమర్శిస్తున్నారు. విగ్రహాలను నిమజ్జనం చేసేటప్పుడు చూపిన శ్రద్ధ,వాటిని తొలగించడంలో మున్సిపాలిటీ చూపడం లేదని మండిపడుతున్నారు.విగ్రహ వ్యర్థాలను తొలగించి నదిని శుభ్రం చేయాల్సిన బాధ్యత మున్సిపాలిటీదేనని,అధికారుల నిర్లక్ష్యం వల్లే గోదావరి కలుషితమవుతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.నది తీరంలోని స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించిన తర్వాత గోదావరిలో స్నానం చేద్దామంటే భయం వేస్తోందని స్థానికులు వాపోతున్నారు.

**ప్రజల డిమాండ్ :** నదిలో పేరుకుపోయిన విగ్రహాల అవశేషాలను వెంటనే జేసీబీల సహాయంతో తొలగించాలని, నదిని శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వచ్చే ఏడాది నుండి పర్యావరణ హితమైన మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని,శాశ్వత నిమజ్జన కొలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.ఇప్పటికైనా మున్సిపాలిటీ కమిషనర్, మున్సిపల్ చైర్ పర్సన్ స్పందించి గోదావరి పరిరక్షణకు చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రజలు,యువజన సంఘాలు,పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు.



## బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియ జేయునది ఏమనగా నేను అనగా గజ్జి మణి దీప్ s/o రాజేందర్, వయస్సు:(23) సంవ త్సరాలు. నివాసం: ఓబులాపూర్ గ్రామం, మల్లాపూర్ మండలం, జగిత్యాల జిల్లాకు చెందిన వాడను. తేదీ:1092026 రోజున ఓబులాపూర్ నుండి మల్లాపూర్ వెళ్తున్న క్రమంలో మార్గం మధ్యలో W 9734738 నంబర్ గల నా పాస్పోర్ట్ మరియు ఇతర సర్టిఫికెట్లు పోయినవి. తర్వాత నేను వెతికి చూడగా పాస్పోర్ట్ సర్టిఫికెట్ల ఆచూకీ కనబడ లేదు. కావున ఎవరికైనా దొరికినచో నాకు సంప్రదించగలరని మనవి

ఇట్లు :గజ్జి మణిదీప్
గ్రామం:ఓబులాపూర్
మండలం:మల్లాపూర్
జిల్లా:జగిత్యాల
సెల్ నం:8520057320

## బిఆర్ఎస్ పార్టీలో చేరిన లచ్చక్కపేట సర్పంచ్

**ప్రజాపక్షం/సారంగాపూర్ :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం లచ్చక్కపేట గ్రామ సర్పంచ్ చెట్లపెల్లి రమ భాస్కర్ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ సమక్షంలో బిజెపి పార్టీని వీడి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటిఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్య క్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మాజీ జెడ్పి చైర్పర్సన్ దావ వసంత సురేష్, నాయ కులు తేలు రాజు, బుర్ర ప్రవీణ్ గౌడ్, చెట్ పల్లి సుధాకర్, అత్తినేని నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఉత్తమ మహిళా రైతుకు ఘన సన్మానం

**ప్రజాపక్షం /సారంగాపూర్ :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామానికి చెందిన ఇటీవల జాతీయ స్థాయిలో ఉత్తమ మహిళా రైతు అవార్డును అందుకున్న సందర్భంగా ఆదివారం బండారి విజయ వెంకటేష్‌ను మున్నూరు కాపు హను మాన్ వాడ సంఘం భవనంలో సభ్యుల సమ క్షంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్ర మంలో సంఘం అధ్యక్షుడు బాదినేని రాజి రెడ్డి, తిరుమల భూమారెడ్డి, వార్డు సభ్యులు చిరంజీవి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజాసేవలో గడ్డం లక్ష్మి రెడ్డి కృషి చిరస్మరణీయం

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి మండలం లోని మూడు బొమ్మల మేడిపల్లి గ్రామ మాజీ సర్పంచ్, ఇబ్రహింపట్నం మండల మాజీ ఉపాధ్యక్షుడు అమరజీవి గడ్డం లక్ష్మి రెడ్డి ప్రజాసేవలు చిరస్మరణీయమని గ్రామ ప్రముఖులు కొని యాడారు.ఆయన 35వ వర్ధంతిని పురస్కరించుకుని గ్రామంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సర్పంచ్‌గా మేడిపల్లి గ్రామ అభివృ ద్ధికి గడ్డం లక్ష్మి రెడ్డి విశేష కృషి చేశారని,ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పాటుపడుతూ మండల స్థాయి ప్రజాప్రతినిధిగా ఎదిగారని గుర్తుచేశారు.నక్సలైట్ల చేతిలో ఆయన ప్రాణాలు కోల్పోవడం గ్రామానికి, ప్రజలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.ఆయన ఆశయా లను కొనసాగిస్తూ యువత ప్రజాసేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.వర్ధంతిని పురస్కరించుకుని గడ్డం లక్ష్మి రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో, వి.ఎన్.ఆర్ విజ్ఞాన్



జ్యోతి ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌జీవో సౌజన్యంతో మేడి పల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. అడ్వకేట్ గడ్డం శంకర్ రెడ్డి,గడ్డం దుర్గాప్రసాద్ రెడ్డి,పీసు రాజేందర్ రెడ్డి,అడ్వకేట్ గడ్డం ప్రశాంత్ రెడ్డితో పాటు గ్రామ ప్రముఖులు,యువ కులు,పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్ట్ పెండ్యాల రామ్ కుమార్ కన్నుమూత

**ప్రజాపక్షం/ముత్తారం :** మంథని ప్రెస్ క్లబ్ సీనియర్ సభ్యుడు, సీనియర్ జర్నలిస్ట్ పెండ్యాల రామ్ కుమార్ (47) అనారోగ్యంతో హైదరాబాదులోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తుది శ్వాస విడిచారు. ఆయన మరణంతో మంథని జర్నలిస్ట్ వర్గంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.రామ్ కుమార్ విద్యార్థి దశ నుంచే అనేక సామాజిక ఉద్యమాల్లో కీలకంగా పనిచే శారు. అనంతరం సుదీర్ఘ కాలం పాటు మంథని కేంద్రంగా జర్నలిస్టుగా వివిధ దినపత్రికల్లో పనిచేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం చొరవ చూపారు. పేద ప్రజల గొంతుకగా, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ప్రజా సమస్యలను తెలియజేయడంలో ఆయన ముందుండేవారు. సామాజిక స్పృహ, నిజాయితీ, నిర్భయ జర్నలిజం ఆయన ప్రత్యేకత. మంథనిలో జరిగిన అనేక ఉద్యమాల్లో,ప్రజా సమస్యల పోరాటాల్లో ఆయన



క్రియాశీల పాత్ర పోషించారు. ఆయన మృతి పట్ల మంథని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంకరి కుమార్ ఉపాధ్యక్షులు బర్ల సంపత్ ప్రధాన కార్యదర్శి పోతరాజు సమ్మయ్య సహాయ కార్యదర్శి గంధం అంజి బాబు కోశాధికారి తగరం రాజు,సీనియర్ జర్నలిస్టులు కొము రోజు మారుతి కొమురోజు చంద్రమోహన్,ఆంకరి ప్రకాష్, కంది కృష్ణారెడ్డి, ఆర్ల బాపు,లక్కాకుల నాగ రాజు,బాసాని సాగర్, ఓజ్జల శ్రీనివాస్ లింగాల సురేష్ దొరగోర్ల రవీందర్ కేసారపు రవి సభ్యులు, వివిధ పార్టీల నాయకులు,ప్రజా సంఘాలు సంతాపం వ్యక్తం చేశారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

**ప్రజాపక్షం/ముత్తారం :** మండలంలో వరి ధాన్యం కొను గోలు కేంద్రాలను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని ముత్తారం మాజీ ఎంపీపీ, లక్కారం సర్పంచ్ అత్తే చంద్ర మౌళి డిమాండ్ చేశారు.ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్లో రైతులు ఎంతో కష్టపడి వరి పంట సాగు చేశారని,అయితే తీవ్ర విద్యుత్ కోతల కారణంగా పంటలు అరకొరగానే పండాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడాన్ని దళారులు అలుసుగా తీసుకుంటున్నారని ఆయన మండిపడ్డారు.మండలంలోని ఒక్కో గ్రామంలో ఒక్కో ధర నిర్ణయిస్తూ, రోజుకో రేటుతో రైతులను మభ్యపె డుతూ ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని ధ్వజమె త్తారు.దళారుల దోపిడీ వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతు న్నారని ఆందోళన వ్యక్తం చేశారు.రైతుల శ్రేయస్సును



దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే మండల వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.కొనుగోలు కేంద్రాల ద్వారా రైతు లకు ప్రభుత్వం ప్రకటిం చిన మద్దతు ధరతో పాటు,బోనస్ మొత్తాన్ని కూడా వెంటనే చెల్లించి రైతాంగాన్ని ఆదుకోవా లని అత్తే చంద్రమౌళి డిమాండ్ చేశారు.

## విజయవంతంగా ఎన్ఎమ్ఎమ్ఎస్ పరీక్ష రాసిన మోడల్ స్కూల్ విద్యార్థులు

**ప్రజాపక్షం/ముత్తారం :**పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల పరిధిలోని దర్యపూర్ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ ఎన్.ఎమ్.ఎమ్.ఎస్ అర్హత పరీక్షను విజయవంతంగా పూర్తి చేశారు.ఆదివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, గాయత్రి విద్యానికేతన్ పరీక్షా కేంద్రాలలో జరిగిన ఈ పరీక్షకు పాఠశాల నుండి మొత్తం 31 మంది (16 మంది బాలురు, 15 మంది బాలికలు) విద్యా ర్థులు హాజరయ్యారు. తల్లిదండ్రులు స్వయంగా పిల్ల లను పరీక్షా కేంద్రాలకు తీసుకువచ్చి, పరీక్ష అనం తరం తిరిగి ఇంటికి తీసుకెళ్లారు.ప్రిన్సిపాల్ అభినంద నలు – విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం:పరీక్ష ముగిసిన అనంతరం పాఠశాల ప్రధానాచార్యులు డాక్టర్ కేసరి సంతోష్ కుమార్ విద్యార్థులను కలిసి వారి పరీక్ష అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థు లంతా పరీక్ష బాగా రాశారని,అందరూ స్కాలర్షి ప్‌కు ఎంపికవుతారనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు దిశా నిర్దేశం చేస్తూ.. "ఈ పరీక్షలో ఎదురైన అనుభవాలను, చేసిన చిన్న చిన్న పొరపాట్లను వచ్చే విద్యాసంవత్స రంలో పరీక్ష రాయబోయే మీ తమ్ము ళ్లకు, చెల్లెళ్లకు వివరించి తగు జాగ్ర త్తలు సూచించాలి అని కోరారు. ఒక వేళ ఫలితాల్లో ఎంపిక కాకపోయినా నిరాశ చెందవద్దని, భవిష్యత్తులో దీని కంటే మెరుగైన అవకాశాలు వస్తా యని సానుకూల దృక్పథంతో,ఆత్మవి శ్వాసంతో ముందుకు సాగాలని



విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని నింపారు.ఈ పరీక్ష కోసం విద్యార్థులను సంసిద్ధం చేయడంలో సహకరిం చిన ప్రతి ఒక్కరికీ ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా పిల్లల ప్రిపరేషన్ కోసం పుస్తకాలను దాతృత్వంతో అందించిన సేవా పరాయణు లకు,విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన బోధకులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.అలాగే, ప్రత్యేక చొరవతో పాఠశాలను సందర్శించి, ఎన్.ఎం.ఎం.ఎస్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి,తేలిక పాటి పద్ధతుల్లో గుర్తుపెట్టుకునే మెలకువలను, అమూల్యమైన సూచనలను అందించిన మంథని ముత్తారం మండల విద్యాధికారి నలుమాసు హరి ప్రసాద్ కి ప్రత్యేక హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ప్రతిరోజూ ప్రత్యేక శిక్షణా తరగతులు విజ యవంతం కావడానికి సహకరించిన పాఠశాల ఉపా ధ్యాయులకు,సిబ్బందికి, తల్లిదండ్రులకు ఈ పత్రికా ప్రకటన ద్వారా ప్రిన్సిపాల్ డాక్టర్ కేసరి సంతోష్ కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న అదనపు జిల్లా మెజిస్ట్రేట్

**ప్రజా పక్షం/బీర్‌పూర్ :** జగిత్యాల జిల్లా బీరుపూర్ మండలంలోని ప్రముఖ దేవస్థానం కోర్టు రెండవ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ జి. శ్రీని ఖిషా,హైకోర్టు అడ్వకేట్ క్రాంతి ఆదివారంబీర్ పూర్ మండల కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకు న్నారు.ఆలయానికి చేరుకున్న వారికి దేవస్థాన అధికారులు,అర్చ కులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి,మొక్కులు తీర్చుకున్నారు.ఈ సంద ర్భంగా అర్చకులు వారికి వేదాశీర్వచనం అందించి,స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన అర్చ కులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ఎంపి అరవింద్ సమక్షంలో బిజెపిలో చేరిక



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** ఇందూరు పార్లమెంట్ సభ్యుడు ధర్మ పురి అరవింద్ సమక్షంలో రాఘవపేట గ్రామానికి చెందిన వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు బోసు రాము ఆదివారం బిజెపి పార్టీలో చేరారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన రాముకు ఎంపీ అరవింద్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో బీజే వైఎం నాయకుడు బైన ప్రశాంత్,కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి దేశెట్టి భూమేష్,నాయకులు రాజారెడ్డి,కోట రమేష్,న్నారు.

## బస్సు ప్రారంభంతో ప్రయాణం సులభతరం



**ప్రజాపక్షం /మల్లాపూర్ :** కోరుట్ల నుండి గుండంపల్లి మల్లాపూర్ మీదుగా బస్సు సౌకర్యం ప్రారంభిస్తుండడంతో దూరం తగ్గి ప్రయా ణికులకు సులభతరం అవుతుందని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు.కోరుట్ల నుండి ఖానాపూర్ వరకు బస్సు సర్వీసులు ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతుండగా ఆదివారం మల్లా పూర్ గుండంపల్లి మధ్యలో ఉన్న రహదారిని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దప్పుల పద్మ నరసయ్య, పార్టీ మండల అధ్యక్షుడు మాట్ల సోమయ్య, కిసాన్ జిల్లా అధ్యక్షుడు జల పతి రెడ్డి,పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు (శీనివాస్ రెడ్డి,వివిధ గ్రామాల సర్పంచులు,కాంగ్రెస్ నాయకులు, తదితరులున్నారు.

## ఓటు చోరీకి వ్యతిరేకంగా ఢిల్లీలో కాంగ్రెస్ భారీ నిరసన

**ప్రజాపక్షం/ముత్తారం :** ఓటు చోరీకి వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిం చిన భారీ నిరసన కార్యక్ర మంలో పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కాంగ్రెస్



పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఢిల్లీలో తలపెట్టిన ఈ భారీ నిరసన కార్యక్రమానికి ముత్తారం మండలం నుండి నాయకులు తరలివెళ్లారు.ఈ కార్యక్రమంలో ముత్తారం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు బియ్యని శివకుమార్,దర్యా పూర్ సర్పంచ్ రాపల్లి రాజయ్య,ఓడేడు,ముత్తారం గ్రామ శాఖ అధ్యక్షులు దాసరి చంద్రమౌళి గౌడ్, కోల విజయ్ గౌడ్,అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు తోడేటి శశికుమార్,తదితరులు పాల్గొని నిరసనను విజయవంతం చేశారు.

# అనాథ పిల్లల మధ్య సర్పంచ్ జన్మదిన వేడుకలు

## నేటితరం యువతకు ఆదర్శంగా నిలిచిన అల్లిపూర్ గ్రామ సర్పంచ్ కోదాటి సాయి కిరణ్ కుమార్



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** జన్మదిన వేడుకల పేరుతో హంగులు, ఆర్భాటాలు, భారీ ఖర్చులు చేసే ఈ రోజుల్లో అల్లిపూర్ గ్రామ సర్పంచ్ కోదాటి సాయి కిరణ్ తన ఆచరణతో ప్రత్యేక గుర్తింపు పొందారు. నేటి తరం యువతకు ఆదర్శంగా నిలుస్తూ, తన జన్మది నాన్ని సుల్తానాబాద్ మండల కేంద్రంలోని దివ్యాం గుల కేంద్రం లోని చిన్నారులతో కలిసి అత్యంత నిరా డంబరంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా అనాథ శరణాలయంలోని చిన్నారులకు ప్రత్యేకంగా భోజన విందు ఏర్పాటు చేసి, వారితో కలిసి ఆప్యాయంగా సమయం గడిపారు. చిన్నారులతో మమేకమై వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ, ప్రేమాభిమా నాలు పంచుకున్నారు. సర్పంచ్ చూపిన ఆత్మీయత చిన్నారుల ముఖాల్లో ఆనందాన్ని నింపగా,వారి చిరున వ్వులే తన జన్మదినానికి నిజమైన కానుకగా భావించి నట్లు ఆయన వ్యవహరిం చారు.ఈ సందర్భంగా సాయి కిరణ్ మాట్లా డుతూ, జీవితంలో ప్రత్యేక సందర్భాలను కేవలం వ్యక్తిగత వేడుకలకే పరి మితం చేయకుండా సమా జానికి ఉపయోగపడే విధంగా జరుపుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.అవసరంలో ఉన్నవారితో సంతోషాన్ని పంచు కోవడం ద్వారా లభించే ఆనందం ఏ ఆర్భాట వేడుక లోనూ దొరకదని పేర్కొన్నారు.సర్పంచ్ చేపట్టిన స్థానిక ప్రజలు,యువత,ప్రజాప్రతినిధులు అభినందించారు. ప్రజాప్రతినిధులు సమాజానికి ఆదర్శంగా నిలవా లంటే ఇలాంటి మానవీయ కార్యక్రమాలు మరింత ప్రేరణ కలిగిస్తాయని వారు పేర్కొన్నారు. తన జన్మది నాన్ని సేవా దృక్పథంతో నిర్వహించిన కోదాటి సాయి కిరణ్ పై పలువురి ప్రశంసలు కురిపించారు. ఈ గట్టి పల్లి గ్రామ సర్పంచ్ దేవేందర్,రాచూరి ప్రవీణ్,తదిత రులు పాల్గొన్నారు.

## రెడ్డి నూతన కార్యవర్గం నియామకం



**ప్రజాపక్షం / గన్నేరువరం :** గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి గ్రామ రెడ్డి సంఘం నూతన కార్యవ ర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా చాడ తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వంగల రాజిరెడ్డిలు నియామకం కాగా నూతన కార్యవర్గ సభ్యు లుగా శ్రీధర్ రెడ్డి, చాడ తిరుపతి రెడ్డి, వంగల రాజిరెడ్డి, ముదిగంటి లక్ష్మారెడ్డి, వడాల నరేందర్ రెడ్డి, ముదిగంటి జలపతి రెడ్డి, కొమ్మర సుధాకర్ రెడ్డిలు నియామకం అయ్యారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం సభ్యులు నూతన కార్యవర్గానికి శుభాకాం క్షలు తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో నూతన కార్యవర్గంలో చోటు కల్పించినందుకు కృతజ్ఞ తలు తెలిపారు. రెడ్డి సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు.

## ఈనెల 3న భారీ ర్యాలీ

### గన్నేరువరం బ్రిడ్జి సాధన సమితి పిలుపు

**ప్రజాపక్షం / గన్నేరువరం :** గన్నేరువరం ఆది అనుమాండ్ల నుంచి ఎలగందుల వరకు బ్రిడ్జి నిర్మాణంలో జరుగుతున్న విపరీతమైన జాప్యాన్ని నిరసిస్తూ ఈనెల 3న భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు గన్నేరువరం బ్రిడ్జి సాధన సమితి నాయకులు మీసం లక్ష్మణ్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రం నుంచి ఆది హనుమాండ్ల వరకు ప్రారంభమయ్యే ఈ ర్యాలీకి రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజ లందరూ పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పంతెన నిర్మాణం కోసం రూ.77 కోట్లు మంజూరైనా బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేయకపోవ డంపై అసహనం వ్యక్తం చేశారు. రోజువారి ప్రయాణికులు, వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని లక్ష్మణ్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి సంబంధిత అధికారు లకు కనువిప్పు కలిగేలా నిర్వహించే ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

## పారిశుద్ధ్య కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం / గంగాధర :** ఆపదసలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి కొండన్నపల్లి గ్రామస్థులు మానవత్వాన్ని చాటుకున్నారు. గంగాధర మండలం కొండన్నపల్లి గ్రామా నికి చెందిన హస్తపురం దుర్గయ్య సుమారు 40 సంవత్స రాల పాటు గ్రామ పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తూ గ్రామానికి విశేష సేవలందించారు. ఇటీవల అనారో గ్యంతో ఆయన మృతి చెందడంతో ఆయన కుటుంబం ఇ బ్బందుల్లో పడింది. దుర్గయ్య కుటుంబ పరిస్థితిని తెలుసు కున్న గ్రామ ప్రజలు, యువకులు మానవతా ధృక్పదంతో ముందుకు వచ్చారు. గ్రామస్థుల సమిష్టి సహకారంతో రూ.65,500 ఆర్థిక సహాయాన్ని సేకరించి బాధిత కుటుం బానికి అందజేశారు. నాలుగు దశాబ్దాలపాటు గ్రామానికి సేవ చేసిన వ్యక్తి కుటుంబానికి అండగా నిలవడం అభినం దనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రేండ్ల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రేండ్ల రాజి రెడ్డి, తొర్రికొండ అంజయ్య, తొర్రికొండ భూమయ్య, రేండ్ల ఎల్లారెడ్డి, రేండ్ల కళింగశేఖర్, పెంచాల రాయమల్లు, అంత గిరి రవి, బట్టు తిరుపతి, కుంట కరుణాకర్, విలాసాగరం మధు, విలాసాగరం రమేశ్, ముప్పిడి హరీష్, ముప్పిడి అజయ్, తొర్రికొండ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రినిటీ టీ-శాట్ పరీక్షకు 3,956 మంది విద్యార్థులు హాజరు

### 5న ఫలితాలు వెల్లడి



**-ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** ఎస్ఎస్సి విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతోపాటు ఐఐటీ, నీట్ వంటి జాతీయస్థాయి పోటీ పరీక్షలపై అవగాహన కల్పిం చేందుకు ట్రినిటీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన టీశాట్ (ట్రినిటి స్కాలర్‌షిప్ ఆప్టిట్యూడ్ టెస్ట్) పరీక్షకు అపూర్వ స్పందన లభించింది. కరీంనగర్ లోని నాలుగు ట్రినిటీ కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 3,956 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా కళాశాల కరస్పాండెంట్ దాసరి ప్రశాంత్ రెడ్డి మా ట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థులకు నాణ్య మైన విద్య అందించడమే తమ లక్ష్యమన్నారు. నవంబర్ 5న పరీక్ష ఫలితాలు ప్రకటించి 1 నుంచి 100 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులతోపాటు ల్యాప్‌టాప్‌లు, ట్యాప్‌లు, ఫీజు రాయితీలు అందజేస్తామని తెలిపారు. గత ఏడాది తమ విద్యార్థులు 68 మంది ఎంబీ బీఎస్, 45 మంది ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించారని వెల్లడించారు. ప్రతి ఆదివారం ట్రినిటీ ప్రైమ్ క్యాంపస్‌లో ఇలాంటి పరీక్షలు నిర్వహిస్తామని పేర్కో న్నారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్రాంచ్‌ల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 5న కరీంనగర్‌కు రానున్న బిజెపి జాతీయ అధ్యక్షుడు

### మహా పాదయాత్రలో పాల్గొననున్న నితిన్ నబిన్



**ప్రజాపక్షం/కరీంనగర్:** బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ 5న కరీంనగర్ కు రానున్నారు. బిజెపి ఆధ్వర్యంలో నిర్వహించే మహాపాదయాత్రలో ఆయన పాల్గొననున్నట్లు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆది వారం తెలిపారు. ఈ మేరకు బిజెపి నేతలతో ఆదివారం నిర్వహించిన మహా పాదయాత్ర సన్నాహక సమావేశంలో సంజయ్ మాట్లాడారు. విదేశీ శక్తులతో, విదేశీ ఆర్థిక సాయంతో బొద్దింక పార్టీ పెట్టిన వాళ్లతో, నేహా బోరా వంటి అరాచక శక్తులతో కలిసి కాంగ్రెస్ కుట్రలు చేస్తోంద న్నారు. మోదీ ప్రభుత్వాన్ని దెబ్బతీసే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఈ అరాచక శక్తుల కుట్రలను ప్రజలకు తెలియజేసేందుకే దేశవ్యాప్తంగా 40 ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ర్యాలీలు చేస్తున్నామని, అందులో భాగంగా తెలం గాణలో హైదరాబాద్, కరీంనగర్ లో ర్యాలీ నిర్వహిస్తున్నా మన్నారు. ఈ ర్యాలీలో భారీ ఎత్తు న జనాన్ని సమీకరించా లని,వినూత్న రీతిలో కార్యక్రమం నిర్వహించాలని నేత లకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ తోపాటు నగర మేయర్ కొలగాని శ్రీని వాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మాజీ మేయర్ డి.శంకర్, బాస సత్యనారాయణ, నల్లాల ఓదేలు, కోమల ఆంజనేయులు, గుజ్జ శ్రీను, రమేశ్, బోయినిపల్లి ప్రవీణ్ రావు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపార సముదాయాల ఏర్పాటతో గ్రామం మరింత అభివృద్ధి

### అల్లిపూర్‌లో 'ప్యారడైజ్ బేకరీ' ప్రారంభించిన సర్పంచ్ కోదాటి సాయికిరణ్

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** వివిధ రకాల వ్యాపార సముదా యాలు ఏర్పాటుతో గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందని సుల్తానాబాద్ మండలంలోని అల్లిపూర్ గ్రామ సర్పంచ్ కోదాటి సాయికిరణ్ అన్నారు. అల్లిపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్యారడైజ్ బేకరీని గ్రామ సర్పంచ్ కోదాటి సాయికిరణ్ ఆది వారం ఘనంగ ప్రారంభించారు. బేకరీ యాజమాన్యం ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కోదాటి సాయికి రణ్ మాట్లాడుతూ, గ్రామంలో కొత్త వ్యాపార సంస్థలు ప్రారంభం కావడం అభివృద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఇటువంటి సంస్థలు మరిన్ని ఏర్పడా లని ఆకాంక్షించారు.వ్యాపార సంస్థ యాజమాన్యానికి శుభాకాం క్షలు తెలియజేస్తూ,సంస్థ అభివృద్ధి చెందాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు,బేకరీ యాజ మాన్యం,యువకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

**ప్రజాపక్షం / గంగాధర :** గంగాధర మండలం వెంకంపల్లి గ్రామ శివారులోని పిట్టలపల్లి వై జంక్షన్ వద్ద ఆదివారం మధ్యాహ్నం సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వెంకం పల్లి గ్రామానికి చెందిన సంకటి మల్లయ్య (82) తన మోటార్ సైకిల్‌పై వెంకంపల్లి నుంచి మధురానగర్ ఎక్స్ రోడ్డు వైపు వెళ్తుం డగా పిట్టలపల్లి వై జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న స్విఫ్ట్ డిజైర్ కారు అతివేగంగా నిర్లక్ష్యంగా వచ్చి మోటార్ సైకిల్ ను ఢీకొ ట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మల్లయ్యను ఆసు పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ధర్మారం గ్రామానికి చెందిన పందిర్ల జగదీశ్వర్ శర్మగా గుర్తించారు. మృతుడి కూతురు కొమ టిరెడ్డి పద్మ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగాధర ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు.

## ప్రతి ఆదివారం అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేయాలి

### ప్రజామిత్ర రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ పిలుపు

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఆదివారం అంబేడ్కర్ విగ్రహాలకు పూలమా లలు వేసి నివాళులర్పించాలని ప్రజామిత్ర ప్రొగ్రెసీవ్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ పిలుపునిచ్చారు. ఆది వారం ఉదయం 10 గంటలకు కరీంనగర్ కోర్టు చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా కొరివి వేణుగోపాల్ మాట్లాడుతూ ఇకపై ప్రతి ఆదివారం ఉదయం 10 గంటలకు కరీంనగర్ పట్టణ కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంబే డ్కర్ అభిమానులు తమ ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గజ్జల ఆనందరావు, క్యాదాసి ప్రభా కర్, కొంపెల్లి రవీందర్, పాటకుల భూమయ్య, చిగిరి శ్రీధర్, ఎడ్ల రాంకుమార్, తాళ్ల వెంకటేశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైన్ పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** నగరంలోని 11వ డివిజన్ పరి ధిలో గల హ్యాపీ హోమ్స్‌లో ఎస్‌డబ్ల్యూజిఆర్ సిసి డ్రైన్ పనులకు కార్పొరేటర్ ఆకుల నర్మద శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం పనులు చేపడు తున్న కాంట్రాక్టర్‌తో మాట్లాడి పలు సూచనలు చేశారు. పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచిం చారు. కాలనీ ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా పను లను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. 11వ డివిజన్ అభి వృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపా యాల కల్పనకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఘనంగా దండారి సంబరాలు



**ప్రజాపక్షం/నేరడిగొండ:** నేరడిగొండ మండలం లక్కంపూర్ గ్రామంలో ఆదివాసీల ఆరాధ్య పండుగ దీపావళి దండారి సంబరాలు ఆదివారం నియమ నిష్టలతో ప్రారంభమయ్యాయి. గ్రామ పటేల్ ఇంటి ముందు గల జెండా గద్దె వద్ద గుస్సాడీ వేషధారణ సామగ్రికి సర్పంచ్ సుజాత గంగాధర్, గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు చేశారు. రాబోయే ఐదు రోజుల పాటు గూడెల్లో గుస్సాడీ నృత్యాలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజనులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం వేలం

**ప్రజాపక్షం/మోర్తాడ్ :** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో 5న ద్విచక్రవాహనం వేలం వేయనున్నట్లు మోర్తాడ్ ఎక్సైజ్ శాఖ సిఐ గుండప్ప ఒక ప్రకటనలో తెలిపారు. నాటుసారా కేసులో పట్టుబడిన ఈ ద్వి చక్ర వాహనం 5న ఉదయం 10 గంటలకు మోర్తాడ్ ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో వేలం నిర్వహించబడునని, వేలంలో పాల్గొనదలచిన వారు 25శాతం ఇఎండి చెల్లించి వేలం పాటలో పాల్గొనాల్సిందిగా సిఐ గుండప్ప తెలిపారు.

## ఆర్మీ మాజీ సైనికుడు మాలవత్ సీతారామ్‌కు ఘనస్వాగతం



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** భారత సైన్యంలో 17 ఏళ్ల పాటు అంకితభావంతో సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన నగరానికి చెందిన మాజీ సైనికుడు సీతారాం నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో ఘనస్వాగతం లభించింది. దేశ రక్షణే ధ్యేయంగా సుధీర్ఘ కాలం సైన్యంలో విధులు నిర్వర్తించి స్వస్థలానికి చేరుకున్న సీతారామ్‌కు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రియల్ టైగర్స్ సైనికులు, వారి కుటుంబ సభ్యులుఆత్మీయ స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలతో అభినందించి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సైన్యంలో 17 ఏళ్ల పాటు విశిష్ట సేవలందించిన సీతారామ్‌ను రియల్ టైగర్స్ సభ్యులు అభినందించారు. దేశ సరిహద్దుల్లో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా దేశ రక్షణ కోసం నిరంతరం శ్రమించే సైనికుల సేవలు వెల కట్టలేనివని, సైనికుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో 1వ టౌన్ ఏసిపి హౌస్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎఎస్ఐ బన్సీలాల్, ఉమ్మడి జిల్లా రియల్ టైగర్స్ సైనికులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని సీతారామ్‌కు అభినందనలు తెలిపారు. దేశ సేవ చేసిన సైనికుడికి లభించిన ఈ ఆత్మీయ స్వాగతం రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# ఢిల్లీ ర్యాలీకి పాదయాత్రగా కాంగ్రెస్ శ్రేణులు

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహిస్తున్న భారీ ర్యాలీలో పాల్గొనేందుకు నిర్మల్ జిల్లా కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.తెలంగాణ భవన్ నుంచి రామ్‌లీలా మైదానం వరకు పాదయాత్రగా బయలుదేరి తమ సంఘీభావాన్ని చాటుకున్నారు.నిర్మల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీహరి రావు ఆధ్వర్యంలో ఈ పాదయాత్ర కొనసాగింది. నిర్మల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు హరీశ్,మహేందర్‌తో పాటు పలువురు ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఈ ర్యాలీలో పాల్గొనేందుకు జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తలు ఢిల్లీకి చేరుకున్నారు. తెలంగాణ భవన్ వద్ద నుంచి కాంగ్రెస్ జెండాలు చేతబట్టి నినాదాలు



చేస్తూ రామ్‌లీలా మైదానం వైపు పాదయాత్రగా సాగారు. పార్టీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు కదిలారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా నాయకులు,కార్యకర్తలు భాగస్వాములు కావడం ద్వారా పార్టీ శ్రేణుల సమీకరణ,ఐక్యతను చాటే ప్రయత్నం చేశారు. జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు హాజరుకావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

# ఇంటిని కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జెసిబితో పొలంలోని (పాం హౌస్) ఇంటిని కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని తిప్పలూరి నారాయణరెడ్డి కోరారు. ఆదివారం ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ మోపాల్ మడలం సిర్పూర్ గ్రామశివారులో తన స్వంత పొలం వద్ద సర్వే నెం. 602/140 పరిధిలో 2008లో ఫామ్‌హౌస్ నిర్మించుకున్నామన్నారు. 2006 జూన్ 26న తాళ్ల పద్మబాయి నుంచి ఈ భూమి కొనుగోలు చేశానని, 2008లో అదే భూమిలో నాలుగు గదులో కూడిన ఇంటిని నిర్మించుకుని గత 20 ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నానన్నారు. గత కొన్ని రోజులుగా ఈ పొలం మాదేనని కొంత మంది ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అక్టోబర్ 31న జుట్టు మహారాజ్ ఆయన శిష్యులు కలసి నాలుగు గదులతో ఉన్న ఇంటిని నేల మట్టం చేశారన్నారు. మాట్లాడుకుందామని చెప్పిన కూడా వినకుండా సామాను బయట పడేసి జెసిబితో కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూమిపై 20242025 లో రెండుసార్లు భూసర్వే చేయించారన్నారు. దాదాపు పది లక్షల నష్టం వాటిల్లిందని కొందరు రాజకీయ నాయకుల ప్రమేయం ఉందని బాధితుని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై స్థానిక ఎస్సైకి ఫిర్యాదు చేశానని, న్యాయం జరగకపోతే అధికారులను కలుస్తానన్నారు. తన స్వంత పొలంలో ఉన్న ఇంటిని కూల్చిన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు.

# జిల్లాలో ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

### ఐదు పరీక్ష కేంద్రాల్లో నిర్వహణ
### 889 మందికి 866 మంది విద్యార్థుల హాజరు



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం ఆధ్వర్యంలో ఆదివారం నిర్మల్ జిల్లాలో నిర్వహించిన జాతీయ ప్రతిభా ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్) ప్రశాంతంగా ముగిసింది.జిల్లాలో ఏర్పాటు చేసిన ఐదు పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరీక్ష నిర్వహించినట్లు జిల్లా విద్యాధికారి దర్శనం భోజన్న తెలిపారు. పరీక్షకు మొత్తం 889 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 866 మంది హాజరయ్యారని, 23 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. మొత్తం హాజరు శాతం 97.41గా నమోదైనట్లు పేర్కొన్నారు.జిల్లాలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో విద్యార్థుల హాజరు వివరాలు ఇలా ఉన్నాయి. బైంసా ఉన్నత పాఠశాలలో 146 మందికి గాను 138 మంది, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల బైంసాలో 143 మందికి 143 మంది హాజరయ్యారు. జుమ్మెరథ్‌పేట్ పాఠశాలలో 173 మందికి గాను 170 మంది, సోమవార్‌పేట్ బాలికల ఉన్నత పాఠశాలలో 173 మందికి 171 మంది, ఖానాపూర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 254 మందికి గాను 244 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. పరీక్షల నిర్వహణ కోసం ప్రతి కేంద్రంలో 20 మంది విద్యార్థులకు ఒకరు చొప్పున పంచాయతీరాజ్ శాఖకు చెందిన కార్యదర్శులను పర్యవేక్షకులుగా నియమించినట్లు డీఈఓ తెలిపారు. వీరితోపాటు ప్రతి పరీక్ష కేంద్రంలో ముఖ్య పర్యవేక్షకుడు, విభాగాధికారి, సిట్టింగ్ స్క్వాడ్,ఆకస్మిక తనిఖీ బృందం, కేంద్ర స్థాయి పరిశీలకులను నియమించి పరీక్షలను పర్యవేక్షించినట్లు వెల్లడించారు.విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి పరీక్ష కేంద్రంలో పోలీసు సిబ్బందితోపాటు వైద్య సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని పేర్కొన్నారు.పరీక్ష కేంద్రాలను సందర్శించిన అధికారులు : జిల్లా విద్యాశాఖ అధికారులు,ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ వివిధ పరీక్ష కేంద్రాలను సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు.విద్యార్థుల హాజరు,పరీక్షల నిర్వహణ,పర్యవేక్షణ ఏర్పాట్లను తనిఖీ చేశారు. మొత్తంగా జిల్లాలో ఎన్ఎంఎంఎస్ పరీక్ష ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసిందని జిల్లా విద్యాధికారి దర్శనం భోజన్న వెల్లడించారు.

# రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్



**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** మండల కేంద్రంలోని కెబిఎ ఇండోర్ స్టేడియంలో ఆదివారం కమ్మర్‌పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీపాద రాజేంద్రచారి స్మారక తెలంగాణ స్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సభాధ్యక్షుడు లుక్క గంగాధర్ అధ్యక్ష తన జరిగిన కార్యక్రమంలో ఆర్మూర్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ రాజేంద్రచారి మరణం కెబిఎకు, వారి కుటుంబానికి తీరని లోటని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. యువత క్రీడల్లో పాల్గొని గ్రామానికి, రాష్ట్రానికి దేశానికి పేరు తీసుకరావాలన్నారు. కెబిఎవారు ముమ్ముందు ఇలాంటి టోర్నమెంట్ నిర్వహించి సామాజిక సేవలు మీ వంతు పాత్రను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ హారిక, రిటైర్డ్ ఎంఇఒ దేవేందర్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భాస్కర్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దేవేందర్, బిజెపి నేత రమేష్, సుంకెట బుచ్చన్న, క్లబ్ సలహాదారులు అహ్మద్, కిషన్, రమేష్, గంగాధర్, గోపి, లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థి సత్తా



**ప్రజాపక్షం/నేరడిగొండ:** మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థి విద్యావర్ధన్ అండర్17 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచి ఇటు ప్రభుత్వ పాఠశాలకు అటు సన్‌రైజర్ క్రికెట్ అకాడమీకి మంచి గుర్తింపు తీసుకువచ్చాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మ అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో క్రీడాకారునిఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెంకట్ రమణ, పీడీ జాదవ్ జగదీష్, ఆనంద్ బాబు, ఉపాధ్యాయ బృందం, ఫిరోజ్‌లు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మాక్ పార్లమెంట్‌లో ఆదిలాబాద్ విద్యార్థుల ప్రతిభ




**ప్రజాపక్షం/ఆదిలాబాద్:** హైదరాబాద్ ఎస్‌సిఇఆర్‌టి ఆడిటోరియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మాక్ పార్లమెంట్‌లో ఆదిలాబాద్ జిల్లా విద్యార్థులు అద్భుత ప్రతిభ చాటారు. గుడిహత్నూర్ టిజిఎంఎస్ విద్యార్థి ముండే సాయినాథ్ తన వాగ్ధాటి, సభా పటిమతో బెస్ట్ మాక్ పార్లమెంటేరియన్ అవార్డును గెలుచుకుని జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. ఇచ్చోడ టిజిటిడబ్ల్యుయుఆర్‌జెసిలో 9వ తరగతి చదువుతున్న రాథోడ్ సిద్ధుకుమార్‌కు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి పాత్రను, ముండే సాయినాథ్‌కు ప్రతిపక్ష సభ్యుడి పాత్రను కేటాయించారు. ఇద్దరూ తమ పాత్రలను అత్యంత ఆత్మవిశ్వాసంతో పోషించగా, సభలో సాయినాథ్ ప్రదర్శించిన ప్రతిభ అందరి ప్రశంసలు అందుకుంది. ఈ విద్యార్థులకు సిరికొండ పిఎం శ్రీ ఎంపిపిఎస్ ప్రధానోపాధ్యాయులు మునేశ్వర్ విజయ్ కుమార్ గైడ్ టీచర్‌గా వ్యవహరించి పార్లమెంటరీ విధానాలు, సభా నియమాలపై తర్ఫీదునిచ్చారు. తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి సుమారు 68 మంది విద్యార్థులు పాల్గొని ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, సమగ్ర శిక్షా స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇ. నవీన్ నికోలస్, ఎఎస్‌పి శ్రీహరి, రాష్ట్ర అకడమిక్ కోఆర్డినేటర్ అర్జున్ తదితరులు హాజరై విద్యార్థులను అభినందించారు.

## కెటిఆర్‌కు అపూర్వ స్వాగతం



**ప్రజాపక్షం/ఆర్మూర్ :** ఆదిలాబాద్ రైతు గర్జన సభకు వెళుతూ మార్గ మధ్యలో ఆదివారం ఆర్మూర్ పట్టణానికి చేరుకున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు పార్టీ జిల్లా అధ్యక్షులు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, భారీ సంఖ్యలో పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి ఘనస్వాగతం పలికారు. ఆర్మూర్ నియోజకవర్గం నలుమూలలతో పాటు పట్టణం నుంచి పెద్ద ఎత్తున కదిలిన బిఆర్ఎస్ శ్రేణులు జీవన్‌రెడ్డి నాయకత్వంలో ఆర్మూర్ బైపాస్ రోడ్డు వద్దకు రాగానే కెటిఆర్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ ఈ సందర్భంగా జీవన్‌రెడ్డితో పార్టీ నేతలు కెటిఆర్‌ను గజమాలతో సత్కరించి ఆయనకు అపూర్వ స్వాగతం పలికారు .అక్కడి నుండి పార్టీ శ్రేణుల కోలాహలం మధ్య సాగిన బైక్ ర్యాలీ అగ్రభాగాన కెటిఆర్ వాహన శ్రేణి ముందుకు కదిలి మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి నివాసానికి చేరుకున్నారు. అనంతరం లంచ్ చేసిన తర్వాత కెటిఆర్ అక్కడి నుండి ఆదిలాబాద్ రైతు గర్జన సభలో పాల్గొనేందుకు వెళ్లారు. ఇదిలా ఉండగా కెటిఆర్‌కు ఘనస్వాగతం పలికే క్రమంలో ఆర్మూర్ పట్టణమంతా గులాబీమయమైంది. గులాబీ రంగు జెండాలు, ఫ్లెక్సీలతో పట్టణాన్ని అలంకరించారు. కెటిఆర్ కొద్దిసేపు ఆగినా అది ఆర్మూర్ గులాబీ ఆర్మీలో నయా జోష్ నింపింది. తన నాయకత్వంలో కెటిఆర్‌కు స్వాగత కార్యక్రమం విజయవంతం కావటంతో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేయడమే కాక పార్టీ శ్రేణుల నిబద్ధతను అభినందించారు.

## కౌటాలలో.. కొమురం భీమ్ వర్ధంతి



**ప్రజాపక్షం / కౌటాలఃఆదివాసీల హక్కులు,** ఆత్మగౌరవ పరిరక్షణ కోసం కొమురం భీమ్ చేసిన పోరాటం చిరస్మరణీయమని మాజీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చైర్మన్ సిడాం గణపతి, మాజీ డిసిఎంఎస్ వైస్ చైర్మన్ కొమురం మాంతయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి నైతం శీతల్ పేర్కొన్నారు. జల్,జంగల్,జమీన్ నినాదంతో పోరాడిన వీరయోధుడు కొమురం భీమ్ 86వ వర్ధంతి వేడుకలను ఆదివారం కౌటాల మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు కొమురం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాల రక్షణకు భీమ్ చూపిన పోరాట బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌటాల మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు, ఆదివాసీ మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## ఘనంగా సాయి భోజన్ మహా అన్నదానం



**ప్రజాపక్షం / బెల్లంపల్లిఃతెలంగాణ కళాశాల** విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి. బాల భాస్కర్ జన్మదినాన్ని పురస్కరించుకుని బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం బెల్లంపల్లిలో మహా అన్నదానం, పండ్ల పంపిణీ నిర్వహించారు. బాల భాస్కర్ కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో యాచకులు, వృద్ధులు, అనాథలు, రోగులకు ఆహారం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాంపెల్లి శంకర్, రాజేశ్వరి మాట్లాడుతూ, విద్యారంగంలో విశేష సేవలందిస్తున్న విద్యావేత్త బాల భాస్కర్ జన్మదినాన అన్నార్తుల ఆకలి తీర్చడం సంతోషంగా ఉందన్నారు. ఆపన్నులకు చేయూతనివ్వడమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు శ్రీవిద్య, త్రయాక్షర్, మేనేజర్ బొద్దున సతీష్, సభ్యులు ఇగురాపు భాస్కర్, జంగం రశ్మిత, సింగతి అక్షర, లాస్య, రూపం కుమారి, దేవర కొండ వర్షిని, మహర్షిత్ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లో చేరికలు



**ప్రజాపక్షం/నేరడిగొండ:** రైతు గర్జన సభ సందర్భంగా ఆదిలాబాద్‌కు విచ్చేసిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు రోల్ మామడ టోల్ ప్లాజా వద్ద ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం నేరడిగొండలోని ఎ మ్మె ల్యే నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గానికి చెందిన పలువురు యువకులు బిఆర్ఎస్‌లో చేరగా, కెటిఆర్ వారి కి కం డువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ ట్రాక్టర్ ప్రైవేట్ పనులకేనా?

### ఇనుప రాడ్ల లోడింగ్ దృశ్యాలు తీసిన విలేకరికి బెదిరింపులు

### వార్త రాయొద్దంటూ ఫోన్లలో ఒత్తిళ్లు



**ప్రజాపక్షం / వాంకిడిఃప్రజాధనంతో** నడిచే గ్రామపంచాయతీ ట్రాక్టర్‌ను ప్రైవేట్ వ్యాపార అవసరాలకు వినియోగిస్తుండటం వాంకిడి మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మండలంలోని జంబుల్దరి గ్రామపంచాయతీకి చెందిన జిపి ట్రాక్టర్‌లో స్థానిక మదీనా ట్రేడర్స్ దుకాణం వద్ద ఇనుప రాడ్లను లోడ్ చేస్తుండగా ఓ విలేకరి కెమెరాలో బంధించారు. ప్రజా అవసరాలకు, పారిశుద్ధ్య పనులకు కేటాయించిన వాహనాన్ని ప్రైవేట్ దుకాణం వద్ద సామగ్రి తరలింపునకు ఎవరి ఆదేశాలతో వాడుతున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ అక్రమాన్ని ప్రశ్నిస్తూ ఫొటోలు తీసిన విలేకరిపై బెదిరింపులకు దిగడంపై స్థానికంగా నిరసన వ్యక్తమవుతోంది. ట్రాక్టర్ పంక్చర్ కావడంతో వాంకిడికి తెచ్చామని సర్పంచ్ సమర్థించుకునే ప్రయత్నం చేసినప్పటికీ, ప్రైవేట్ దుకాణంలో ఇనుప రాడ్లు ఎందుకు లోడ్ చేశారనే విషయమై పొంతనలేని సమాధానాలు ఇస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఆ సామగ్రి ఎవరిది, ట్రాక్టర్ డీజిల్, ఇతర ఖర్చులు పంచాయతీ ఖాతా నుంచే చెల్లిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పైగా ఈ అంశంపై వార్తలు రాయవద్దంటూ సర్పంచ్‌తో పాటు జై నూర్ ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు ఫోన్లలో ఒత్తిళ్లు తీసుకురావడం గమనార్హం. గ్రామపంచాయతీ ఆస్తులను ప్రైవేట్ వ్యక్తుల స్వప్రయోజనాలకు వాడటంపై జిల్లా పంచాయతీ అధికారులు, ఎంపిడిఒ స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ట్రాక్టర్ లాగ్‌బుక్, డీజిల్ బిల్లులను తనిఖీ చేసి, అక్రమాలకు పాల్పడిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## పోటీ పరీక్షల్లో నెగ్గే వరకూ ఉచిత శిక్షణ

### డిసిపి ఎ.భాస్కర్



**ప్రజాపక్షం / మంచిర్యాలఃయువత** పోటీ పరీక్షల్లో విజయం సాధించే వరకూ ఉచిత శిక్షణ, గ్రాండ్ టెస్టులు కొనసాగుతాయని మంచిర్యాల డిసిపి ఎ.భాస్కర్ స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లా యంత్రాంగం, రామగుండం కమిషనరేట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న శిక్షణలో భాగంగా ఆదివారం మంచిర్యాలలో నిర్వహించిన గ్రాండ్ టెస్ట్‌ను ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ 500 మంది అభ్యర్థులకు ఉచిత భోజన, వసతితో హైదరాబాద్ నిపుణుల ద్వారా తరగతులు అందిస్తున్నామని, ఆదివారం నాటి గ్రాండ్ టెస్ట్‌కు 713 మంది హాజరయ్యారని తెలిపారు. నవంబర్ చివరి వారం, డిసెంబర్ 19న జరిగే కానిస్టేబుల్, ఎస్ఐ పరీక్షల వరకు ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. పరీక్షల అనంతరం సబ్జెక్టు నిపుణులతో విశ్లేషణ తరగతులు నిర్వహిస్తూ సమయపాలన, ఒత్తిడిని అధిగమించే మెళకువలు నేర్పిస్తున్నామని చెప్పారు. ఈ శిక్షణ ఎస్ఎస్సీ, బ్యాంకింగ్, యుపిఎస్సి, టిజి పిఎస్సి పరీక్షలకూ దోహదపడుతుందన్నారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్న నోడల్ అధికారి, బెల్లంపల్లి ఆర్ఐ సంపత్, సిబ్బందిని డిసిపి అభినందించారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసులు ముందుంటారు

### ఎస్‌హెచ్ఒ తహసీనుద్దీన్



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ఃసమాజంలో** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో పోలీసులు నిరంతరం భాగస్వామ్యం అవుతారని సిసిసి నస్పూర్ ఎస్‌హెచ్ఒ తహసీనుద్దీన్ అన్నారు. ఆటోలో మరిచిపోయిన మహిళ పర్సును సిసిటివి ఫుటేజీ ఆధారంగా గుర్తించి, అందులోని 20 గ్రాముల బంగారు నెక్లెస్, సెల్‌ఫోన్‌ను ఆదివారం బాధితురాలికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నస్పూర్ మండలం మల్లికార్జున నగర్‌కు చెందిన బల సంకుల మంగ అక్టోబర్ 29న రాత్రి మంచిర్యాల నుంచి ఆటోలో ఇంటికి వస్తూ నస్పూర్ గేట్ వద్ద దిగారని, ఆ సమయంలో ఆటో వెనుక సీటులో పర్సును మరిచిపోయారని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టి, సిసిటివి దృశ్యాల ఆధారంగా ఆటోను గుర్తించి పర్సును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఎస్ఐ తహసీనుద్దీన్ చేతుల మీదుగా బాధితురాలికి బంగారు నెక్లెస్, ఫోన్‌ను తిరిగి అప్పగించారు. కేసును త్వరితగతిన ఛేదించిన క్రైమ్ పార్టీ సిబ్బంది టి. జితేందర్ సింగ్, పి. వెంకటసాయిని మంచిర్యాల రూరల్ సిఐ జి. రవీందర్ అభినందించారు.

## బిజెపి ఓట్లు చోరీ చేస్తోంది




**ప్రజాపక్షం / జైపూర్ఃదేశంలో** బిజెపి ఓటర్లను చోరీ చేస్తోందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం దేశ రాజధాని ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు జైపూర్ మండల కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లా రు.రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ పిలుపు మేరకు మండలంలోని పలు గ్రామాల నాయకులు సభకు హాజరయ్యారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా పోరాడుదాం, నా ఓటు నా హక్కు అంటూ చెన్నూర్ నియోజకవర్గం పేరిట ప్లకార్డులు చేతబూని సభలో నిరసన తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ ఓటు హక్కు రక్షణ కోసం కదలాలని నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్ల విశ్వంబర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి గోనె నర్సయ్య, మండల ప్రధాన కార్యదర్శులు మంతెన లక్ష్మణ్, వేముల రవీందర్ గౌడ్, ఉపాధ్యక్షుడు ఉస్కమల్ల రవి, సర్పంచ్ తాళ్ళపెల్లి అంజన్ గౌడ్, సీనియర్ నాయకులు మున్నా భాయి పాల్గొన్నారు.

## వీడియో జర్నలిస్టు శ్రీనివాస్ అకాల మృతి తీరని లోటు



**ప్రజాపక్షం / దండేపల్లిఃవీడియో** జర్నలిస్టు పులిపాక శ్రీనివాస్ అకాల మృతి మీడియా రంగానికి తీరని లోటని దండేపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బండి రవి గౌడ్, లక్సెట్టిపేట సర్కిల్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి నిజాముద్దీన్ పేర్కొన్నారు. లక్సెట్టిపేట సర్కిల్ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో ఆదివారం దండేపల్లి ప్రెస్ క్లబ్ కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. మందమర్రిలో వీడియో జర్నలిస్టుగా పనిచేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన శ్రీనివాస్ చిత్రపటానికి పలువురు జర్నలిస్టులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, శ్రీనివాస్ ప్రజా సమస్యలను, స్థానిక వార్తలను ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా నిబద్ధతతో ప్రజల ముందుకు తీసుకువచ్చారని కొనియాడారు. ఆయన కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దండేపల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు, లక్సెట్టిపేట సర్కిల్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

## బిజెవైఎం జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా నవీన్ కుమార్



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ఃకొమరం** భీం ఆసిఫాబాద్ జిల్లా బిజెవైఎం సోషల్ మీడియా కన్వీనర్‌గా ఎంపికైన అలుగొట్టు నవీన్ కుమార్‌ను బిజెవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరెండ్ల ప్రవీణ్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎలగతి సుచిత్, జిల్లా ఇన్చార్జ్ మాదే మహేందర్ ఆదివారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో బాధ్యతలను అప్పగించిన పార్టీ జిల్లా, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అప్పగించిన బాధ్యతలను పూర్తి నిబద్ధతతో నిర్వహిస్తూ పార్టీ అభివృద్ధికి శ్రమిస్తానని చెప్పారు. బిజెపి ఆశయాలు, సిద్ధాంతాలు, చేపడుతున్న ప్రజా పోరాటాలను సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ సంస్థాగత బలోపేతానికి నిరంతరం పాటుపడతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిజాయితీతోనే సంస్థకు సమృద్ధి

### జిఎం రాధాకృష్ణ



**ప్రజాపక్షం / మందమర్రిఃనిజాయితీ,** నైతిక విలువలు, పారదర్శకతతో విధులు నిర్వర్తిస్తూ అవినీతి రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సింగరేణి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ పిలుపునిచ్చారు. కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సివిసి) ఆదేశాల మేరకు నిజాయితీతో సమృద్ధి అనే నినాదంతో చేపట్టిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను శనివారం మందమర్రి సిఇఆర్ క్లబ్, రామకృష్ణాపూర్ ఆర్‌కెసిఒఎ క్లబ్, ఇల్లందు క్లబ్‌లలో ఆయన అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ వారోత్సవాలను నవంబర్ 1 వరకు అన్ని గనులు, విభాగాల్లో విస్తృతంగా చేపడుతున్నట్లు తెలిపారు. సింగరేణి పురోగతిలో ఉద్యోగులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ సంస్థ ప్రతిష్ఠను కాపాడాలని సూచించారు. అనంతరం ఉద్యోగులతో కలిసి విజిలెన్స్ సత్యనిష్ఠ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఏరియా సేవా అధ్యక్షురాలు శ్రీవాణి రాధాకృష్ణ, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఐక్యతా భావం, దేశభక్తి పెంపొందించుకోవాలి

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ని ర్వహించే జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పు రస్కరించుకుని సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ... దేశ సమగ్రత, సమైక్య త కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సే వలు ప్రతి భారతీయుడికి స్ఫూర్తి దాయకమ ని అన్నారు. ముఖ్యంగా యువత సర్దార్ ప టేల్ జీవితాన్ని ఆద ర్శంగా తీసుకుని దేశభ క్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ, దేశ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని, ఐక్యతతోనే బలమైన, సమర్థవం తమైన భారతదేశ నిర్మాణం సాధ్యమని నిమ్మల శ్రీనివాస్ పేర్కొన్నారు.

## రిసానెట్ 2027 ప్రవేశ పరీక్ష విజయవంతం

**ప్రజాపక్షం/హనుమకొండ:** హనుమకొండ రెసోనెన్స్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నవంబర్ 1న నిర్వహించిన రిసానెట్ 2027 (స్కాలర్ షిప్ అడ్మిన్ టెస్ట్)ప్రవేశ పరీక్ష విజయవంతంగా ముగిసింది.ఈపరీ క్షకు 3,85 4 మంది విద్యార్థులు హాజర య్యారు.ఈసంధర్భంగా కళాశాల సంస్థ చైర్మన్ రాజిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల లోని ప్రతిభను గు ర్తించి,వారి విద్యాసామ ర్థ్యాన్ని అంచనా వేయడంతోపాటు ఉన్నత విద్యకు అవసరమైన మార్గదర్శకత్వం అందించడమే పరీక్ష ముఖ్యఉద్దేశమ న్నారు.కళాశాలపై నమ్మకంతో భారీ సంఖ్యలో విద్యార్థులు హాజరు కావడం అనందంగా ఉందని నాణ్యమైన విద్యతో విద్యార్థులను ఉన్నత లక్ష్యాలవైపు నడిపిం చేందుకు కృషిచేస్తామని తెలిపారు.

## రాష్ట్రస్థాయి అండర్ 14 వాలీబాల్ జట్టుకు వరుణ్

**ప్రజాపక్షం/పాలకుర్తి:** గూడూరు జెడ్పీహె చ్ఎస్ విద్యార్థి వరుణ్ రాష్ట్రస్థాయి అండర్ 14 బాలుర వాలీబాల్ జట్టుకు ఎంపిక య్యారు. ఉమ్మడి వరంగల్ జట్టుకు ఎంపిక య్యాడు. ఉమ్మడి వరంగల్ జిల్లా జేఎస్ఎస్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఎంపిక పోటీలలో ప్రతిభ కనబరిచి జట్టులో చోటు సంపాదిం చారు.ఈ సందర్భంగా ఎంఈవో పోతు గంటి నర్సయ్య వరుణ్‌ను అభినందించారు. వరుణ్‌కు శిక్షణ అందించిన వ్యాయామ ఉపాధ్యాయులు చిట్యాల యా దిని ప్రశం సించారు. ఉపాధ్యాయులు వరుణ్‌కు శుభా కాంక్షలు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల లోను రాణించి పాఠశాలకు, గ్రామానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## ఇందిరాగాంధీ సమాధి వద్ద దావెర అనిల్ నివాళులు

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** ఢిల్లీలో ఉన్న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సమాధి శక్తిస్థ లన్‌ను మండల కాంగ్రెస్ పార్టి అధ్యక్షుడు దావెర అనిల్ కుమార్ సందర్శించి నివా ళులు అర్పించారు. ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, టిపిసిసిఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు లకావత్ ధన్వంతి లక్ష్మినారా యణ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### కాళేశ్వరం ప్రాజెక్టును పునరుద్ధరించి..

## రైతులకు సాగునీరు అందించాలి

### మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

**ప్రజాపక్షం / గంగాధర :** కాళేశ్వరం ప్రాజెక్టును వెంటనే పునరుద్ధరించి రైతులకు సాగునీరు అందించాలని చొప్ప దండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కనువిప్పు కలిగిం చేందుకే సైకిల్ యాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. మేడిగడ్డ నుంచి కొండపోచమ్మ వరకు సుమారు 400 కిలో మీటర్ల మేర బిఆర్ఎస్ నాయకులు చేపట్టిన సైకిల్ యాత్ర గంగాధర మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సంద ర్భంగా గంగాధరలో యాత్ర బృందానికి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో గంగాధర మండల బిఆర్ ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సంద ర్భంగా యాత్ర బృందం నాయకులు మాట్లాడుతూ కాళే శ్వరం ప్రాజెక్టు ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడం తోపాటు ప్రాజెక్టుపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టేందుకే ఈ యాత్ర చేపట్టామన్నారు. మాజీ



ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజె క్టుతో చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర, చొప్ప దండి, రామడుగు మండలాల మెట్ట ప్రాంతాలు సస్యశ్యా మలంగా మారాయన్నారు. రైతుల ప్రయోజనాలను దృ ష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే ప్రాజెక్టు మరమ్మత్తు లు చేపట్టి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం యాత్ర బృందానికి అభినందనలు తెలిపి వారి తో కలిసి సైకిల్ యాత్రలో పాల్గొని ఉత్సాహం నింపారు.

## కెసిఎఫ్ఎఫ్ఏ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** కరీంనగర్ కన్సూమర్ ఫీల్డ్ ఫోర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం కరీంనగర్‌లోని శుభమం గళ బ్యాంకెట్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షుడిగా అక్కు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా రమేశ్, కోశాధికారిగా కొలిపాక వినేష్, కార్యదర్శిగా శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా పెద రంగం సరీన్ ప్రమాణ స్వీకారం చేశారు. కమిటీ సభ్యు లుగా సంపత్, రాజేశ్, మధు, వెంకటేశ్, రాజు స్వస్తిక్, రంగవేణి శ్రీను, రాము, అనిల్, సాయి కోయాస్, రవి సన్‌సోలైట్, సంతోష్ ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం జరిగిన సమావేశంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పిట్టల మధు మాట్లా డుతూ సభ్యులందరూ ఐక్యంగా పని చేస్తూ అసోసియే



షన్ సభ్యుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తూ సమిష్టిగా మనమందరం అసోసియేషన్ ముందుకు నడిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మీడియా కన్వీనర్ చిట్టిమల్ల మహేందర్, కాడర్ల శ్రీనివాస్, నాగరాజు, రాజు, అనిల్ కుమార్, మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ ప్రణాళికా నిబందనలు తుంగలో తొక్కుతున్నారు!

**ప్రజాపక్షం /వేలేరు :** వేలేరు మండలం లోని ఓగ్రామంలో ఇళ్ల నిర్మాణం అడ్డూ అదుపూ లేకుండా కొనసాగుతున్నా యనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామపంచాయితీ ని బంధనలు,ప్రణాళి కలను తుంగలో తొక్కి గ్రామ అభివృద్ధిని పక్కనపెట్టి కొందరు ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆగ్రామం లో ఇప్పటికే ఉన్న రహదారికి ఇరువైపులా నిర్మాణాలు చే పట్టడంతో భవిష్య త్తులో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడం అధికారు లకు,ప్రజాప్రతినిధులకు సవాలుగా మారే పరిస్థితి నెలకొం టుందని ప్రజలు అంటున్నారు. గ్రామాల్లో ప్ర ణాళికాబ ద్ధమైన అభివృద్ధిజరగాల్సి ఉండగా,నిర్మాణాల వి ష యంలో సంబంధిత అధికారులు,పాలకవర్గం సభ్యులు



ముందస్తు పర్యవేక్షణ చేపడుతు న్నారా.?లేకా వారి ఇష్టారాజ్యంగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయా? ఇళ్ల నిర్మాణాలు జరుగుతుంటే అధికారు లు, ప్రజాప్రథి నిధులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్ర శ్నలు తలెత్తుతున్నాయి. ఇప్ప టికైనా సంబందిత అధికారులు క్షేత్రస్థా యిలో పరిశీలన చేపట్టి,నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరు తున్నారు.గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థకు అవసరమైన స్థలాన్ని గుర్తించి,శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.లేదంటే భవిష్యత్తులో డ్రైనేజీ నిర్మాణం కల గానే మిగిలిపోవడమే కాకుండా ఇళ్లోకి మురుగునీరు చేరే అవకాశం ఉటుందని ఆందోళన వ్యక్తమవుతోంది.

## ఓటరు నమోదు కార్యక్రమానికి విశేష స్పందన

**ప్రజాపక్షం/కెయుక్యాంపస్ :** కాక తీయ యూనివర్సిటీ బి ఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు బైర పాక ప్రశాంత్ ఆ ధ్వర్యంలో నిర్వ హిస్తున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు న మోదు అవగాహన కార్య క్రమంలో భాగంగా గ్రావిటీ జూని యర్ కాలేజ్, రాష్టర్ అకాడమీ, గీతాంజలి డిగ్రీ కాలేజ్, రా మప్ప కోచింగ్ అకాడమీలను సందర్శించి విద్యా ర్థులు, అ ధ్యాపకులు, గ్రాడ్యుయేట్లకు ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్ర క్రియపై మాజీ పార్లమెంట్ సభ్యుడు బోయిన పల్లి వినోద్ కుమార్, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యుడు దాస్యం వినయ్ భాస్కర్, మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, ప్రొఫెసర్ దినేష్ కుమార్ అవ గాహన కల్పించారు.



ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవ స్థలో ఓటు హక్కు అత్యంత విలువైన దని, ముఖ్యంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ తమ ఓటును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ కార్య క్రమం ద్వారా వివిధ విద్యాసంస్థల్లోని విద్యార్థులు, అధ్యా పకులు, పట్టభద్రులకు ఓటరు నమోదు ఆవశ్యకతను వివ రించి, నమోదు ప్రక్రియపై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ప్రతి అర్హులైన పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించడమే లక్ష్యంగా ఈ అవగాహన కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలి పారు. బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థి నాయకులు, కళా శాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓటు నమోదు గడువు నవంబర్ 6 వరకు మాత్రమే



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :**వరం గల్ పశ్చిమ నియోజకవర్గ ప రిధిలోని పట్టభద్రులందరూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు న మోదు చేసుకోవడానికి నవంబర్ 6వ తేదీ చివరి గడువు అని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలి పారు. సమయం చాలా తక్కువగా ఉన్నందున ఇప్పటివరకు ఓటు నమోదు చేసుకోని పట్టభద్రులు వెంటనే తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరుతున్నానని తెలిపారు. కాబట్టి అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకొని, నవంబర్ 6వ తేదీలోగా తప్పనిస రిగా ఓటు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నానని కోరారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు కావాలి



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు కావాలని మండల సమన్వయ కమిటీ సూచన మేరకు క్లస్టర్ గ్రామాలు తిడుగు, సాగరం, కోనాయి చలం గ్రామాల యువతను బిఆర్ఎస్వి విద్యార్థి నాయకుడు పిన్నింటి విజయ్ కోరారు. ఆయా గ్రామశాఖల ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మె ల్సీ ఓటరు నమోదు గ్రామ ఇన్‌చార్జులతో కలిసి ఆయా గ్రామాల్లో ఓ టు నమోదు చేసుకోవాలని యువతకు సూచించారు. రాష్ట్రంలో యు వతను నమ్మించి నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించేం దుకు పట్టభద్రులకు దొరికిన వజ్రాయుధం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక అని విజయ్ అన్నారు. గతంలో ఓటరుగా ఉన్నప్పటికీ ఈ సారి మళ్లీ నమోదు చేసుకోవాలని, 06వ తేదీ చివరి రోజు కాబట్టి నమోదు కానీ వారు 9121914400 బిఆర్ఎస్ పార్టీ ఓటరు న మోదు కేంద్రాన్ని సంప్రదించాలని విజయ్ సూచించారు. ఈ కార్య క్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు నల్లతీగల రవి, బోరగాని రాజేశ్వర్ రావు, కొప్పుల లింగన్న, తిడుగు ఉప సర్పంచ్ కలకోటి మనోహర్, యువజన నాయకులు నల్లతీగల శ్రీకాంత్, ఆయా గ్రామాల పట్టభ ద్రుల ఇంచార్జీలు కలకోటి ప్రసన్న, నితిన్ పిన్నింటి, యువ నాయ కులు తీగల రాజు, పవన్, హరీష్, రాకేష్, వంశీ, పాల్గొన్నారు.

## రైల్వే ట్రాక్‌పై దొరికిన బ్యాగును బాధ్యతాయుతంగా అప్పగించిన కీమెన్

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** జనగామ రైల్వే స్టేషన్ పరిధిలో రైల్వే ట్రాక్‌పై ఒక బ్యాగు కనిపించడంతో విధులలో ఉన్న కీ మెన్ దయా నంద్ వెంటనే అప్రమత్తమై సంబంధిత అధికారులను సంప్రదిం చారు. అనంతరం ఆ బ్యాగును జనగామ స్టేషన్ మాస్టర్‌కు జీఆర్పీ కానిస్టేబుల్ వెంకన్నకు అప్పగించడం జరిగింది. బ్యాగులో విలువైన వస్తువులు ఉన్నట్లు గుర్తించిన కానిస్టేబుల్ నరేష్ నిజాయితీతో, బాధ్య తాయుతంగా వ్యవహరించి బ్యాగును అప్పగించిన కీమెన్ దయానం ద్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

## పట్టభద్రుల ఓటరు నమోదులో పాలకుర్తి ప్రథమ స్థానంలో నిలవాలి: ఝాన్సిరెడ్డి

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలోఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని టిపి సిసి ఉపాధ్యక్షురాలు, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాం డ్ల ఝాన్సిరెడ్డి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నవంబర్ 6వ తేదీలోగా అర్హులైన ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పాలకుర్తి నియోజకవర్గం ఓటరు నమోదు ప్రక్రియలో ప్రథమ స్థానంలో నిలిచేలా పార్టీ శ్రేణు లంతా సమన్వయంతో పనిచేయాలని కోరారు.